ఈంజంబాక్కంలో పడవల పోటీలను మంత్రి సుబ్రమణ్యంతో కలిసి తిలకిస్తున్న డిప్యూటీ సీఎం





అరివాలయంలో డీఎంకే ఎంపీల సమావేశంలో మాట్లాడుతున్న సీఎం స్టాలిన్

ప్రతి రోజూ మహిళా దినోత్సవమే

● డిప్యూటీ సీఎం ఉదయనిధి ● ఈంజంబాక్కంలో పడవ పోటీలు

అడయార్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ముఖ్యమంత్రిగా స్టాలిన్ బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి మహిళలకు ప్రతి రోజూ మహిళా దినోత్సవంగా మారిపోయిందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి అన్నారు. తన పుట్టిన రోజును పురస్కరించుకుని నగర శివారు ప్రాంతమైన ఈంజంబాక్కంలో మత్యకార గ్రామాల యువకులకు పడవ సవారీ పోటీని ఆదివారం నిర్వహించారు. ఈ పోటీలను డిప్యూటీ సీఎం ఉదయనిధి జెండా ఊపి ప్రారంభించారు. ఉద్దాండి ఉంచి ఊరూర్ కుప్పం వరకు జరిగిన ఈ పోటీల్లో 13 మత్స్యకార గ్రామాల యువకులు ఉత్సాహంతో పాల్గొన్నారు. ఈ పోటీల్లో తొలి విజేతగా నిలిచిన మోహన్, కన్నన్‌లతో పాటు మిగిలిన రెండు స్థానాల విజేతలకు ఉదయనిధి బహుమతులు అందించారు. ఈ సందర్భంగా ఆయన ప్రసంగిస్తూ, రాష్ట్రంలో డీఎంకే ప్రభుత్వం సుపరిపాలన సాగుతుందన్నారు. శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని జరుపుకున్నామన్నారు. ముఖ్యమంత్రిగా స్టాలిన్ బాధ్యతలు చేపట్టిన తర్వాత మహిళలకు ప్రతి రోజూ ఒక మహిళా దినోత్సవంగా మారిపోయిందన్నారు. అలాగే, జాలర్ల సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నారన్నారు. జాలర్లు సహజసిద్ధంగా మరణిస్తే మృతుడి కుటుంబానికి రూ.25 వేల ఆర్థిక సాయం చేస్తున్నారని, ఫిషింగ్ బోటు రెన్యువల్ కాలపరిమితిని మూడేళ్ళకు ఒకసారి చేసుకునేలా ఆదేశాలిచ్చారన్నారు. ఫిషింగ్ యూనివర్సిటీలో జాలర్ల పిల్లలకు 5 శాతం రిజర్వేషన్లు కల్పించారన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి ఎం.సుబ్రహ్మణ్యం, ప్రభుత్వ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



ఈంజంబాక్కం సభలో లబ్ధిదారులకు సహాయాలు అందజేస్తున్న ఉదయనిధి

నిర్బంధ హిందీ, నియోజక వర్గాల పునర్విభజనపై

కేంద్రాన్ని నిలదీయండి

● డీఎంకే ఎంపీలకు స్టాలిన్ హితవు

చెన్నై, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): తమిళభాష, సంస్కృతులను కాపాడుకోవాల్సిన సమయం ఆసన్నమైందని, హిందీ భాషను నిర్బంధంగా అమలు చేయడానికి జరుగుతున్న ప్రయత్నాలను అడ్డుకునే దిశగా సోమవారం నుంచి ప్రారంభమవుతున్న రెండో విడత పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల్లో డీఎంకే ఎంపీలు బలమైన వాదనలతో పాలకపక్షాన్ని నిలదీయాలని డీఎంకే అధ్యక్షుడు, ముఖ్యమంత్రి స్టాలిన్ పార్టీ ఎంపీలకు విజ్ఞప్తి చేశారు. తేనాంపేట అన్నా అరివాలయంలో ఆదివారం ఉదయం జరిగిన డీఎంకే ఎంపీల సమావేశానికి ఆయన అధ్యక్షత వహించారు. ఈ సమావేశంలో మూడు తీర్మానాలను ప్రతిపాదించి ఆమోదించారు. ఆ సందర్భంగా స్టాలిన్ మాట్లాడుతూ రాష్ట్రానికి చెందిన ఎంపీలు అన్యభాషలకు వ్యతిరేకం కాదనే విషయాన్ని ఉభయ సభల్లో ప్రకటించాలని, ఎన్ని భాషలు నేర్చుకున్నా ఫరవాలేదని, అదే సమయంలో ఏ భాష కూడా నేర్చుకోవాలని నిర్బంధించకూడదని డీఎంకే దశాబ్దాలుగా వ్యతిరేకిస్తున్నదనే విషయాన్ని అన్ని పార్టీల ఎంపీలకు అర్థమయ్యేలా డీఎంకే ఎంపీలు వివరించాలన్నారు. ఎంపీలు తమ వాదనలను వినిపించేటప్పుడు ఇతర భారతీయ భాషలపై కువిమర్శలకు పాల్పడకూడదని స్టాలిన్ హెచ్చరించారు. హిందీని నిర్బంధంగా చదివేందుకు తోడ్పడే జాతీయ విద్యావిధానాన్ని వ్యతిరేకిస్తున్నామనే కారణంగా కేంద్రం నిధులను నిలిపివేయడం సబబేనా అని పాలక పక్షాన్ని నిలదీసేందుకు ఎంపీలు వెనుకాడకూడదన్నారు.

పునర్విభజన పార్టీ సమస్య కాదు..

పార్లమెంట్‌లో డీఎంకే సభ్యులు లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజనను వ్యతిరేకిస్తూ మాట్లాడేటప్పుడు కూడా ఆ సమస్య తమ పార్టీకి సంబంధించినది కాదని, రాష్ట్ర భవిష్యత్తును అంధకారంలో నెట్టే ప్రయత్నమనే విషయాన్ని సభికులకు స్పష్టపరిచేలా ప్రసంగించాలని స్టాలిన్ చెప్పారు. ఢిల్లీలోనే రాష్ట్రానికి చెందిన అన్ని పార్టీల ఎంపీలతో సమావేశమై, వారి అభిప్రాయాలను కూడా తెలుసుకుని, సభలో వాదనలు వినిపించాలని ఆయన సూచించారు. ఈ సమావేశంలో డీఎంకే కోశాధికారి, ఎంపీ టీఆర్ బాలు, పార్టీ పార్లమెంటరీ కమిటీ అధ్యక్షురాలు, ఎంపీ కనిమొళి, తిరుచ్చి శివా, ఆర్.ఎస్.భారతి, దయానిధి మారన్, తమిళచ్చి తంగపాండ్యన్, ఎ.రాజా, డాక్టర్ కళానిధి వీరాసామి, జగద్రక్షగన్, కదిర్ ఆనంద్, సెల్వగణపతి, అరుణ్ నెహ్రూ, తంగతమిళ్‌సెల్వన్, డాక్టర్ రాణి శ్రీకుమార్ తదితరులు పాల్గొన్నారు.

3 తీర్మానాలు...

ఈ సమావేశంలో డీఎంకే ఎంపీలు మూడు తీర్మానాలు ప్రతిపాదించి ఆమోదించారు. జనాభా నియంత్రణ పథకాన్ని సమర్థవంతంగా అమలు చేసినందుకు లోక్‌సభ నియోజకవర్గాల తగ్గించేందుకు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలను అడ్డుకునేలా పార్టీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి స్టాలిన్ దక్షిణాది రాష్ట్రాల ప్రతినిధులతో ఉమ్మడి కార్యాచరణ కమిటీ ఏర్పాటు దిశగా చేపడుతున్న చర్యలను హర్షిస్తూ మొదటి తీర్మానం చేశారు. రాష్ట్రంలో త్రిభాషా విద్యావిధానాన్ని జాతీయ విద్యావిధానం సాకుతో అమలు చేయడానికి ప్రయత్నిస్తున్న కేంద్రానికి వ్యతిరేకంగా స్టాలిన్ చేపట్టే భవిష్యత్ కార్యాచరణకు తామండగా ఉంటామని ఆ తీర్మానంలో పేర్కొన్నారు. నియోజవర్గాల పునర్విభజన వల్ల నష్టపోనున్న ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, కేరళ, తెలంగాణా, ఒడిశా, పశ్చిమబెంగాల్ పంజాబ్ రాష్ట్రాలకు చెందిన రాజకీయ పార్టీలను కూడా కలుపుకుని కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీయడానికి ప్రయత్నిస్తామని పార్టీ నేతకు భరోసా ఇస్తూ రెండో తీర్మానం చేశారు. నిర్బంధ హిందీని అమలు చేసి తమిళభాషకు ముప్పువాటిల్లచేసేందుకు కేంద్రం చేస్తున్న కుట్రను అడ్డుకునేలా, నియోజకవర్గాల పునర్విభజనను వ్యతిరేకించేలా ఉభయ సభల్లో వాదనలను వినిపిస్తామని ఈ విషయంలో పార్టీ ఎంపీలందరూ ఒకే బాట.. ఒకే మాటగా వ్యవహరిస్తామని మూడో తీర్మానం ప్రతిపాదించారు.

స్పీకర్‌పై అన్నాడీఎంకే అవిశ్వాస తీర్మానం ?



స్పీకర్ అప్పావు

టి.నగర్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర శాసనసభ వార్షిక బడ్జెట్ సమావేశాల్లో స్పీకర్ అప్పావుపై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టేందుకు ప్రధాన ప్రతిపక్షం అన్నాడీఎంకే సన్నద్ధమవుతోంది. ఈ నెల 14న బడ్జెట్ సమావేశాలు ప్రారంభమవుతున్న విషయం విదితమే. వార్షిక బడ్జెట్ సమావేశాలే ఎక్కువ రోజులు జరుగుతాయి. వచ్చే యేడాది శాసన సభ ఎన్నికలు జరుగనుండటంతో ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్ మాత్రమే ప్రవేశపెడతారు. అందుకనే ఈ బడ్జెట్ సమావేశాలను మే రెండో వారం వరకు జరపాలని డీఎంకే ప్రభుత్వం భావిస్తోంది. బడ్జెట్ ప్రతిపాదనలపై జరుగనున్న చర్చల సందర్భంగా నాలుగేళ్ల డీఎంకే పాలనలో అమలు చేసిన పథకాలను ప్రస్తావిస్తూ ముఖ్యమంత్రి ప్రసంగించనున్నారు. అదే సమయంలో ప్రధాన ప్రతిపక్షం అన్నాడీఎంకే ఈ సమావేశాల్లో పాలకపక్షంపై ధ్వజమెత్తేందుకు సిద్ధమవుతోంది. గతంలో డీఎంకే ప్రధాన ప్రతిపక్షంగా ఉన్నప్పుడు అప్పటి పాలకపక్షమైన అన్నాడీఎంకే ప్రభుత్వాన్ని పలు అంశాలపై తీవ్ర విమర్శలు చేసి ముప్పుతిప్పలు పెట్టింది. అంతటితో ఆగకుండా అప్పటి శాసనసభ స్పీకర్ ధనపాల్‌పై ఏకంగా అవిశ్వాసతీర్మానాన్ని కూడా ప్రవేశపెట్టింది. స్పీకర్ పదవి నుండి ధనపాల్‌ను తొలగించాలని కూడా పట్టుబట్టింది. 10 మంది శాసనసభ్యుల సంతకంతో అప్పటి ప్రధాన ప్రతిపక్ష నాయకుడి హోదాలో స్టాలిన్ అవిశ్వాసతీర్మానాన్ని ప్రవేశపెటారు. డీఎంకే అనుసరించిన ఆ పద్ధతిలోనే ప్రస్తుతం అన్నాడీఎంకే కూడా స్పీకర్ అప్పావుపై అవిశ్వాసతీర్మానాన్ని ప్రవేశపెట్టేందుకు సిద్ధమవుతోందని ఆ పార్టీ సీనియర్ నాయకుడొకరు తెలిపారు. ఈ నెల 14న శాసనసభ సమావేశం ముగియగానే జరిగే సభా వ్యవహారాల మండలి సమావేశంలో పది మంది సభ్యుల సంతకంతో స్పీకర్ అప్పావుపై అవిశ్వాస తీర్మానం ప్రతిపాదిస్తూ నోటీసు ఇవ్వనున్నారు. స్పీకర్ అప్పావు తనపై ప్రవేశపెట్టనున్న అవిశ్వాస తీర్మానాన్ని సభలో ఏ రోజు ప్రవేశపెట్టాలనే విషయమై ప్రకటన చేయనున్నారు. ఈ అవిశ్వాసతీర్మానం వీగిపోతుందని అందరికీ తెలిసినదే అయినా పాలకపక్షంపై ఆరోపణలు చేయడానికి ఇంతకు మించి అవకాశం ఉండదని ఎడప్పాడి పళనిస్వామి భావిస్తున్నారు. అవిశ్వాసతీర్మానం ప్రవేశపెట్టిన తర్వాత ఈపీఎస్ సుదీర్ఘంగా సభలో ప్రసంగించేందుకు వీలవుతుంది. అదే సమయంలో ఆ పార్టీ సీనియర్ సభ్యులు కూడా పాలకపక్షం అవినీతి ఎండగట్టే అవకాశాలు కూడా ఉన్నాయి. ఈపీఎస్ చేసిన ఆరోపణలను, విమర్శలను ఖండిస్తూ ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్, పాలకపక్ష సభానాయకుడిగా వ్యవహరిస్తున్న సీనియర్ మంత్రి దురైమురుగన్ ఎక్కువ సేపు ప్రసగించనున్నారు.

ప్రతి విషయాన్నీ రాజకీయం చేయొద్దు

● హిందీని బలవంతంగా రుద్దడం లేదు
● మహారాష్ట్ర గవర్నర్ సీపీఆర్



మీడియాతో మాట్లాడుతున్న మహారాష్ట్ర గవర్నర్ రాధాకృష్ణన్

అడయార్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): తమిళనాడు రాష్ట్రంలో ప్రతి అంశాన్ని రాజకీయం చేస్తున్నారని మహారాష్ట్ర గవర్నర్ సీపీ రాధాకృష్ణన్ ఆరోపించారు. ఆయన ఆదివారం కోయంబత్తూరు ఎయిర్‌పోర్టులో మీడియాతో మాట్లాడుతూ, తమిళనాడు రాష్ట్రంలో మాతృభాష తమిళంలోనే విద్యనభ్యసించాలన్నదే కొత్త జాతీయ విద్యా విధానం ప్రధాన లక్ష్యమన్నారు. రాష్ట్రంలోని అనేక విద్యా సంస్థల్లో తమిళాన్ని బోధించడం లేదన్నారు. ఈ పరిస్థితి మారాలంటే రాష్ట్రంలో నూతన జాతీయ విద్యా విధానాన్ని అమలు చేయాలన్నారు. ఇందులో ఒక్కటి త్రిభాషా విద్యా విధానమన్నారు. మూడో భాషగా ఏ భాష అయినా ఎంచుకోవచ్చన్నారు. కొత్త జాతీయ విద్యా విధానంలో ఏ భాషను బలవంతంగా రుద్దడం లేదన్నారు. ముఖ్యంగా హిందీ అస్సలు ప్రయోగించడం లేదన్నారు. ఇక్కడ దురదృష్టకరం ఏమిటంటే.. తమిళనాడులో ప్రతిదీ రాజకీయం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. హిందీని బలవంతంగా రుద్దడం లేదనీ, దానికి వ్యతిరేకంగా ఎవరూ ఉద్యమాలు చేయాల్సిన పనిలేదన్నారు.

హెలికాప్టర్లలో వచ్చినా విజయ్ పదవులివ్వరు

● టీవీకే ప్రధాన కార్యదర్శి బుస్సీ ఆనంద్



చెన్నై, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): తమిళగ వెట్రి కళగం నాయకుడు విజయ్ దశాబ్దాలుగా తనను ఆరాధిస్తున్న అభిమాన సంఘాల నాయకులను, సభ్యులను వట్టి చేతులతో పంపరని ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి బుస్సీ ఆనంద్ అన్నారు. విజయ్ తన అభిమాన సంఘాల కృషి మరువరని, వారికి పార్టీలో తగిన పదవులిచ్చి గౌరవిస్తారని ఆయన స్పష్టం చేశారు. విల్లుపురంలో పార్టీ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ పార్టీలో మహిళలకు ప్రాధాన్యత కల్పిస్తున్నామని, ఇప్పటివరకూ ప్రకటించిన 14 జిల్లా శాఖ కార్యదర్శుల్లో ఐదుగురు మహిళలు కూడా ఉన్నారని చెప్పారు. ఇతర పార్టీల నుండి వచ్చే నేతలను పార్టీలో చేర్చుకుని పెద్ద పెద్ద పదవులు ఇస్తున్నారంటూ ప్రత్యర్థులు చేస్తున్న విమర్శలలో నిజం లేదన్నారు. ఇతర పార్టీలకు చెందినవారు వారెంతటి ధనవంతులైనా, హెలికాప్టర్లలో వచ్చినా వారికి విజయ్ పదవులిచ్చేందుకు సిద్ధంగా లేర న్నారు. పార్టీలో అట్టడుగు స్థాయిలో ఉన్న కార్యకర్తలను కూడా పార్టీలో ఉన్నత స్థితికి తెచ్చేందుకు విజయ్ తీవ్రంగా పాటుపడుతున్నారని, విద్యావంతులైన యువకులు, మహిళలకు కూడా పార్టీలో కీలకమైన పదవులు సిద్ధంగా ఉన్నాయని చెప్పారు.

రంజాన్ వేళలు
ఇఫ్తార్ (సోమవారం) : 6.26
సహర్ (మంగళవారం) : 4.39



సామవేదం షణ్ముఖశర్మ సారథ్యంలో నిర్వహిస్తున్న శివపదం గానకచేరీ

ఆధ్యాత్మిక సాధనతో

శ్రీమన్నారాయణతత్వం

● బ్రహ్మశ్రీ సామవేదం షణ్ముఖశర్మ ● ఘనంగా ముగిసిన విష్ణు సహస్రనామ సారవైభవం

ప్యారీస్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): ఆధ్యాత్మిక సాధనతో శ్రీమన్నారాయణ తత్వాన్ని తెలుసుకోవడం సాధ్యమవుతుందని, సాధన సమన్వయ శ్రేష్ఠి బ్రహ్మశ్రీ సామవేదం షణ్ముఖశర్మ ప్రవచించారు. టి.నగర్ వెంకటనారాయణ రోడ్డులోవున్న శృంగేరి భారతీ విద్యాశ్రమం ఆడిటోరియంలో శర్వాణి సంగీత సభ ట్రస్ట్ ఆధ్వర్యంలో, శృంగేరి భారతీ విద్యాశ్రమం సహకారంతో నిర్వహించిన మూడురోజుల 'విష్ణు సహస్రనామ సారవైభవం' ఆధ్యాత్మిక ప్రవచన కార్యక్రమం ఆదివారంతో ముగిసింది. చివరి రోజు సాయంత్రం 'శివ పదం' విశిష్ట గాన కచేరి సామవేదం షణ్ముఖశర్మ సారథ్యంలో జరిగింది. ఈ కచ్చేరిలో ప్రముఖ గాయకులు నిహాల్, వెంకట నాగరాజన్ గానానికి సుదర్శనం (వైలన్), ఎస్.విజేంద్రన్ (మృదంగం), కల్యాణ్‌కుమార్ (కీబోర్డు) వాద్యసహకారమందించారు. అనంతరం ప్రవచన కార్యక్రమం ప్రారంభంలో బ్రహ్మశ్రీ సామవేదం షణ్ముఖశర్మను చెన్నై కస్టమ్స్, జీఎస్టీ కమిషనర్ కేఎస్ఎస్వీ ప్రసాద్, సంగీత విద్వాన్‌మణి డాక్టర్ తాడేపల్లి లోకనాధ్‌శర్మ సహా పలువురు తెలుగు ప్రముఖులు సత్కరించారు. ఈ సందర్భంగా సామవేదం మాట్లాడుతూ 1999వ సంవత్సరం 'శివ పదం' విశిష్ట గాన తొలి కచే రిని శర్వాణి సంగీత సభ ప్రారంభించిందని, అప్పటినుంచి నిర్విరామంగా పలు ప్రాంతాల్లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సభ ట్రస్టీ సూరి శ్రీవిలాస్ సహకారంతో మద్రాస్ మహానగరంలో ప్రవచించేందుకు తనకు అవకాశం వచ్చిందని ప్రసంశించారు. అనంతరం విష్ణుసహస్రనామ సారవైభవంపై ప్రవచిస్తూ మానవుడిలో వుండే అరిషడ్వర్గాలను జయించిన భీష్ముడు అంపశయ్యపై వున్న సమయంలో సచ్చిదానంద స్థితితో 58రోజుల పాటు (దక్షిణాయణ కాలం చివరినుండి ఉత్తరాయణం వరకు) విష్ణు సహస్రనామాన్ని పఠించి, అంపశయ్య మీదనుండే ధర్మరాజుకు రాజనీతి, ధర్మ సూత్రాలతో పాటు అష్టసిద్ధులను బోధించాడన్నారు. ఉత్తరాయణ ఆగమన కాలం సమీపించాక ఇచ్ఛానిర్యాణం(కోరుకున్నప్పుడే చావు) కలిగి మాఘ శుక్లపక్ష ఏకాదశి నాడు భీష్ముడు, విష్ణు సహస్రనామావళిని ఈ జగత్తుకు అందించి తన లోకానికి చేరుకున్నాడని సామవేదం సభకు వివరించారు.



హాజరైన తెలుగువారు

డీఎంకేతో టచ్‌లో ఉంటే వేటే

● పార్టీ నేతలకు ఈపీఎస్ హెచ్చరిక



వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిస్తున్న ఈపీఎస్

చెన్నై, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): అధికార డీఎంకే మంత్రులతో రహస్యంగా మంతనాలు చేస్తూ, వారితో ఎల్లప్పుడూ టచ్‌లో ఉండే పార్టీ నేతలు ఎంతటివారైనా బహిష్కరిస్తానని అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి, మాజీ ముఖ్యమంత్రి ఎడప్పాడి పళనిస్వామి (ఈపీఎస్) హెచ్చరించారు. రాష్ట్ర శాసనసభకు వచ్చే యేడాది ఎన్నికలు జరుగనుండటంతో పార్టీని ఆ ఎన్నికలకు పటిష్టపరిచే నిమిత్తం ఆదివారం జిల్లా నేతలతో సమావేశమయ్యారు. రాయపేటలోని పార్టీ ప్రధాన కార్యాలయం ఎంజీఆర్‌మాళిగై నుంచి 82 జిల్లా శాఖల కార్యదర్శులతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. శాసనసభ ఎన్నికలకు సిద్ధం, బూత్ కమిటీల బలోపేతం తదితర అంశాలపై చర్చించారు. ఆ సందర్భంగా తిరుచ్చి జిల్లాకు చెందిన పార్టీ నేతలపై ఈపీఎస్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. తిరుచ్చి జిల్లా అన్నాడీఎంకే కంచుకోటగా ఉండేదని, స్థానిక నాయకుల మధ్య ఐకమత్యం కొరవడటం, ప్రజల దగ్గర తీవ్రస్థాయిలో ప్రచారం నిర్వహించకపోవడం వల్లే ఆ జిల్లాలో పార్టీ బలం బాగా తగ్గిపోయిందన్నారు. తిరుచ్చి జిల్లా సహా పలు జిల్లాల్లో డీఎంకేకు చెందిన మంత్రులతో అన్నాడీఎంకే స్థానిక నాయకులు సఖ్యతతో మెలగుతున్నట్లు జిల్లా నేతలు ఈపీఎస్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో ఏయే నాయకులు డీఎంకే మంత్రులతో సఖ్యతగా ఉన్నారో వారి పేర్లు తనకు పంపితే వారిని వెంటనే పార్టీ నుండి బహిష్కరిస్తానని హెచ్చరించారు. శాసనసభ ఎన్నికలకు ఇక యేడాదిమాత్రమే ఉందని, ఇప్పటి నుండే పార్టీ శ్రేణులు ప్రచారంలో వేగం పెంచాలని ఆయన విజ్ఞప్తి చేశారు. డీఎంకే అవినీతి పాలనపై కరపత్రాలు ముద్రించి ఇంటింటికీ వెళ్ళి వాటిని పంపిణీ చేయాలని కోరారు. ఈ సమావేశంలో పార్టీ ప్రిసీడియం ఛైర్మన్ తమిళ్‌మగన్ హుసేన్, మాజీ మంత్రి కేపీ మునుసామి, ఎస్పీ వేలుమణి తదితరులు పాల్గొన్నారు.

సమాచార దర్శిని

నేడు త్యాగరాజ స్వామి రథోత్సవం

పెరంబూర్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): తిరువొత్తియూరు త్యాగరాజ స్వామి ఆలయ మాసి మాసం బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం ఉదయం రథోత్సవం నిర్వహించనున్నారు. ఆలయ నిర్వాహకులు, భక్తుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టారు. 12న ఉదయం కల్యాణ సుందరర్‌స్వామి తిరుకళ్యాణం జరుగనుందని నిర్వాహకులు తెలిపారు.

30 నుంచి చెన్నై-కొచ్చిన్ విమాన సేవలు

పెరంబూర్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): చెన్నై నుంచి కొచ్చిన్‌కు ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ సంస్థ రోజువారీ విమాన సేవలు అందించనుంది. ప్రస్తుతం చెన్నై నుంచి కొచ్చిన్‌కు ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ సంస్థ ఆది, గురువారాలు మాత్రమే విమానాలు నడుపుతోంది. ప్రయాణికులు, పర్యాటకుల విజ్ఞప్తి మేరకు ఈ నెల 30వ తేది నుంచి డైలీ విమాన సేవలు అందించనున్నట్లు, మరిన్ని వివరాలకు airindiaexpress.com అనే వెబ్‌సైట్ సంప్రదించవచ్చని సంస్థ ఒక ప్రకటనలో తెలిపింది.

అన్నానగర్ వాటర్ బోర్డు చిరునామా మార్పు

పెరంబూర్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక అన్నానగర్ మండలం 107వ వార్డు పరిధిలోని అమింజికరై నరసింహన్ వీధిలో మెట్రోవాటర్ బోర్డు కార్యాలయం ఉంది. ఈ కార్యాలయం సోమవారం నుంచి 'నెం.65, వాటర్ ట్యాంక్ రోడ్డు, ఎంఎండీఏ కాలని, అరుంబాక్కం, చెన్నై-106' అనే చిరునామాకు మారనుందని పన్నుల చెల్లింపులకు ఈ చిరునామాలోని కార్యాలయాన్ని సంప్రదించాలని వాటర్ బోర్డు ఒక ప్రకటనలో తెలిపింది.

నేడు, రేపు చెంగల్పట్టులో సీఎం పర్యటన

పెరంబూర్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి స్టాలిన్ సోమ, మంగళవారాల్లో చెంగల్పట్టు జిల్లాలో పర్యటించనున్నారు. ఈ మేరకు సచివాలయం విడుదల చేసిన ప్రకటనలో... ఉదయం 10 గంటలకు పయనూరు సిప్కాట్‌లో గోద్రేజ్ కర్మాగారాన్ని సీఎం ప్రారంభించనున్నారు. అనంతరం నెమ్మేలి లీలావతి కల్యాణ మండపంలో కాంచీపురం ఉత్తర జిల్లా నిర్వాహకుల సమావేశంలో ముఖ్యమంత్రి పాల్గొంటారు. మరుసటిరోజు ఉదయం 11 గంటలకు రత్న కినరు జంక్షన్ ఫ్లైఓవర్ నుంచి చెంగల్పట్టు జిల్లా ఆస్పత్రి వరకు రోడ్ షోలో సీఎం పాల్గొని ప్రజలను కలుకుంటారు. అనంతరం కలెక్టర్ కార్యాలయం ప్రాంగణంలో రెవెన్యూ గ్రామీణాభివృద్ధి సహా 25 ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో 47,749 మంది లబ్ధిదారులకు రూ.389.53 విలువైన సంక్షేమ సహాయాలను అందజేయనున్నారు. సీఎం పర్యటనపై మంత్రి టీఎం అన్బరసన్, జిల్లా కలెక్టర్ అరుణ్‌రాజ్ ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్నారు.

చెంగల్పట్టు పోలీసుశాఖలో 12న వాహనాల వేలం

పెరంబూర్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా సారాయి తరలింపు కేసుల్లో స్వాధీనం చేసుకున్న వాహనాలను చెంగల్పట్టు జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలోఈ నెల 12న వేలం వేయనున్నారు. ఇదివరకే నిర్వహించిన వేలంలో అమ్ముడుపోని 18 వాహనాలు సహా మొత్తం 37 వాహనాలు వేలం వేయనున్నారు. జిల్లా ఎస్పీ కార్యాలయం సమీపంలోని ఐటీఐ ప్రాంగణంలో మంగళవారం ఉదయం 10 గంటలకు బహిరంగ వేలం ద్వారా వాహనాలు విక్రయించనున్నారు. ఆసక్తి కలిగిన వారు సోమవారం సాయంత్రం 5 గంటలలో రూ.1,000 డిపాజిట్ చెల్లించి పేరు నమోదుచేసుకోవాలని ఎస్పీ కార్యాలయం ఒక ప్రకటనలో పేర్కొంది.

రేషన్ కార్డుకు 2 కిలోల గోధుమ

పెరంబూర్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని రేషన్ దుకాణాల్లో బియ్యం కార్డుదారులకు, బియ్యానికి బదులుగా 5కిలోల వరకు గోధుమలు ఇస్తున్నారు. ఇందుకోసం నెలకు 17,100 టన్నుల గోధుమలను కేంద్రం కేటాయిస్తోంది. ఈ నెల నుంచి గోధుమల కేటాయింపు 8,576 టన్నులకు తగ్గించారు. అందువల్ల ఒక్కో కార్డుదారుడికి 2 కిలోల గోధుమలు ఇవ్వాలని రేషన్ ఉద్యోగులకు రాష్ట్ర ఆహార శాఖ తెలియజేసింది. దీంతో రాష్ట్రానికి ఇదివరకు కేటాయిస్తున్నట్లు అదనపు గోధుమలు కేటాయించాలని కేంద్ర ఆహార శాఖకు విజ్ఞప్తి చేసింది.

లోక్ అదాలత్‌లో 74,922 కేసులకు పరిష్కారం

పెరంబూర్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర న్యాయపనుల కమిషన్ ఆధ్వర్యంలో ఈ ఏడాది మొదటి జాతీయ లోక్ అదాలత్ రాష్ట్రవ్యాప్తంగా శనివారం జరిగింది. రాష్ట్ర న్యాయపనుల కమిషన్ అధ్యక్షుడు, హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి కేఆర్ శ్రీరామ్ ఉత్తర్వుల మేరకు, లోక్ అదాలత్‌లో మద్రాసు హైకోర్టులో 8 ధర్మాసనాలు, హైకోర్టు మదురై డివిజన్ బెంచ్‌లో మూడు ధర్మాసనాలు ఏర్పాటుచేసి, పెండింగ్‌లో ఉన్న కేసులు విచారించారు. రాష్ట్ర వ్యాప్తంగా జిల్లా, తాలూకా కోర్టుల్లోని 431 బెంచ్‌ల్లో పెండింగ్ కేసులు విచారించారు. వీటిలో 74,992 కేసులు పరిష్కరించి, బాధితులకు రూ.659.01 కోట్ల పరిహారం అందించారు. లోక్ అదాలత్‌లో పలు ప్రభుత్వ శాఖలు, బీమా సంస్థలు, బ్యాంక్ పాల్గొన్నాయి.

రైల్వేస్టేషన్లలో ప్రయాణికులకు విశ్రాంతి గదులు

పెరంబూర్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక సెంట్రల్, తిరుచ్చి, మదురై, కోవై తదితర ప్రధాన రైల్వేస్టేషన్లలో ప్రయాణికుల బసచేసేందుకు విశ్రాంతి గదులు అందుబాటులో ఉన్నాయి. ఈ సౌకర్యాన్ని ద్వితీయ శ్రేణి రైల్వేస్టేషన్లలోనూ ప్రైవేటు భాగస్వామ్యంతో ఏర్పాటుచేయాలని దక్షిణ రైల్వే నిర్ణయించింది. ఈ గదుల్లో3 నుంచి అధికంగా 48 గంటల వరకు బసచేసేందుకు అనుమతించనున్నారు. తక్కువగా రూ.25 నుంచి రుసుము వసూలుచేయనున్నారు. ఆ ప్రకారం, చెన్నై ఎగ్మూర్, తాంబరం, చెంగల్పట్టు, అరక్కోణం, తిరువళ్లూరు, గుమ్మిడిపూండి సహా 10 రైల్వేస్టేషన్లలో ప్రయాణికుల విశ్రాంతి గదుల ఏర్పాటుకు టెండర్లు ఆహ్వానించినట్లు, త్వరలో నిర్వహణ సంస్థను ఎంపిక చేసి విశ్రాంతి గదులు అందుబాటులోకి తీసుకురానున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు.

చదురగిరికి రోజూ భక్తులను అనుమతించాలి!

● హైకోర్టు ఉత్తర్వు

పెరంబూర్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): విరుదునగర్ జిల్లా చదురగిరి కొండపై వెలసిన సుందర మహాలింగం ఆలయంలో పూజలు చేసేందుకు, భక్తులను ప్రతిరోజు ఉదయం 6 నుంచి 10 గంటల వరకు అనుమతించాలని హైకోర్టు మదురై డివిజన్ బెంచ్ ఆదేశించింది. సుందపాండియన్ సడయాడి 2023లో హైకోర్టులో దాఖలుచేసిన పిటిషన్‌లో... నవరాత్రి సందర్భంగా కొండ ఆలయంలో 10 రోజుల పూజలు, మూడు రోజులు బస చేసేందుకు అనుమతించేలా అటవీ శాఖ, దేవాదాయ శాఖలను ఆదేశించాలని పిటిషన్‌లో కోరారు. ఈ పిటిషన్ న్యాయమూర్తి పి.పుహళేంది విచారించిన సమయంలో ప్రభుత్వం తరఫున కొన్ని వర్గాలను మాత్రమే రాత్రి పూట ఆలయంలో బస చేసేందుకు అనుమతిస్తే, ఇతరులు కూడా తమకు అవకాశం ఇవ్వాలని కోరుతూ పిటిషన్లు వేసే అవకాశముందని, రాత్రి బసకు అనుమతిస్తే వారు వంట చేసేందుకు ప్రయత్నిస్తారని, ఈ కారణంగా అడవిలో అగ్ని ప్రమాదాలు జరిగే అవకాశముందని ప్రభుత్వం తెలిపింది. అందుకు న్యాయమూర్తి.... దేశంలోని పౌరులందరికి ఆలోచన, భావ వ్యక్తీకరణ, నమ్మకం, ఆరాధన స్వేచ్ఛ రాజ్యాంగం పరిరక్షిస్తుందని, ఆ హక్కులకు విఘాతం కలిగిస్తున్నందుకే ఇలాంటి ఆంక్షలు విధించారన్న పిటిషనర్ వాదన అంగీకరిస్తున్నామన్నారు. చదురగిరి కొండ యాత్ర భక్తులకు ఒక విశేషమైన, గర్వించదగిన సందర్భమన్నారు. ప్రజా ప్రయోజనాల దృష్ట్యా, అటవీ శాఖతో సంప్రదించి సహేతుకమైన ఆంక్షలతో దేవాదాయ శాఖ కొత్త మార్గదర్శకాలు జారీ చేయవచ్చని న్యాయమూర్తి అభిప్రాయం వ్యక్తం చేశారు. ప్రతిరోజు ఉదయం 6 నుంచి 10 గంటల వరకు భక్తులు అటవీ శాఖ చెక్‌పోస్ట్ ద్వారా అనుమతించాలని, ఉదయం 10 గంటల తర్వాత ప్రవేశద్వారం మూసివేయాలని సూచించింది. అలాగే, దర్శనానంతరం సాయంత్రం 4 గంటలకు భక్తులు సురక్షితంగా కొండ నుంచి దిగేలా చర్యలు చేపట్టాలని, అనుమతి లేకుండా ఎవరైనా కొండపై రాత్రి పూజ బసచేస్తే వారిపై అటవీ శాఖ చర్యలు తీసుకోవచ్చని తెలిపింది. పాలిథిన్, ప్లాస్టిక్, అగ్ని ప్రమాదాలు సంభవించే వస్తువులను నిషేధించాలని, అటవీ శాఖ ప్రవేశ ద్వారం వద్ద భక్తులను క్షుణ్ణంగా తనిఖీ చేయాలని, నిషేధిత వస్తువులు ఉంటే వాటిని స్వాధీనం చేసుకోవాలని సూచించింది. అటవీ ప్రాంతంలో అక్రమ కార్యకలాపాలు జరగకుండా అట వీ శాఖ, వేట నిరోధక విభాగం పోలీసులు, పర్యావరణ పరిరక్షణ కమిటీ సభ్యులతో కమిటీ ఏర్పాటుచేసి పర్యవేక్షించాలని హైకోర్టు ఉత్తర్వులు జారీచేసింది.



చదురగిరి కొండ ప్రవేశ ద్వారం

తిరుప్పూరు గోడౌన్‌లో అగ్ని ప్రమాదం

● రూ. లక్షల్లో ఆస్తినష్టం

చెన్నై, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): తిరుప్పూరులో టన్నుల కొద్దీ బనియన్ వేస్టేజీని నిల్వ చేసే గోదాములో ఆదివారం వేకువజాము సంభవించిన భారీ అగ్ని ప్రమాదంలో లక్షలాది రూపాయల విలువైన వస్తువులు కాలిబూడిదయ్యాయి. తిరుప్పూరు మణియక్కారపాళయం ప్రాంతానికి చెందిన మహమ్మద్ ఫయాజ్ బనియన్ వ్యర్థాలు నిల్వచేసే గోదాము నడుపుతున్నారు. ఆ గోదాములో శనివారం అర్ధరాత్రి దాటిన తరువాత 1.30 గంటల ప్రాంతంలో ఉన్నట్టుండి దట్టమైన పొగతో మంటలు చెలరేగాయి. స్థానికులు గమనించి వెంటనే తిరుప్పూరు సౌత్, నార్త్ అగ్నిమాపక సిబ్బందికి ఫిర్యాదు చేశారు. ఈ సమాచారం అందుకున్న అగ్ని మాపక దళం ఐదు ఫైరింజన్లు, వాటర్ ట్యాంకర్లతో వెళ్లి సుమారు ఆరుగంటలసేపు పోరాడి మంటలను ఆర్పివేశారు. అప్పటికి ఆ గోదాములో లక్షలాది రూపాయల విలువైన బనియన్ల వేస్టేజీ ఇతర సామగ్రి కాలిబూడిదైంది. ఈ సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని విచారణ జరుపుతున్నారు.



మంటలను అదుపుచేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

ఈడీ దాడులకు భయపడం.. చట్టపరంగా ఎదుర్కొంటాం: మంత్రి రఘుపతి

ప్యారీస్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం (ఈడీ) దాడులకు భయపడబోయేది లేదని, చట్టపరంగా ఎదుర్కొంటామని న్యాయశాఖామంత్రి రఘుపతి పేర్కొన్నారు. పుదుకోటలో ఆయన ఆదివారం మీడియాతో మాట్లాడుతూ, రాష్ట్రంలో త్రిభాషా విద్యాదవిధానానికి మద్దతుగా బీజేపీ సంతకాల సేకరణోద్యమం చేపట్టిందని, దానికి చెప్పుకోదగ్గ స్థాయిలో ప్రజలు మద్దతు తెలుపడంలేదన్నారు. ముఖ్యమంత్రి స్టాలిన్ పిలుపు మేరకు ద్విభాషా విద్యావిధానానికి రోజురోజుకు ఆదరణ పెరుగుతోందన్నారు. త్రిభాషా విద్యావిధానంపై తాము నిలదీస్తున్నందుకే ఈడీ దాడులు కొనసాగుతున్నాయని, రాష్ట్రంలో పెరుగుతున్న అసంతృప్తి దిశ మార్చేందుకే టాస్మాక్ కార్యాలయాలు, గోడౌన్లలో జరుగుతున్న దాడులకు డీఎంకే భయపడబోదని, చట్టపరంగా వీటిని ఎదుర్కొంటామన్నారు. మైనార్టీవర్గాలను ఎవరు మోసం చేయలేరని, తమిళగ వెట్రి కళగం అధ్యక్షుడు విజయ్ రాష్ట్రప్రభుత్వం గురించి చేసిన వ్యాఖ్యల గురించి పట్టించుకోబోమన్నారు. గవర్నర్ ఆర్‌ఎన్ రవి రెండు కీలకమైన బిల్లులను ఆమోదించడం అభినందనీయమన్నారు.

గెలుపు గుర్రంపై పీకే పందెం

● ఎండీఎంకే నేత దురై వైగో

పెరంబూర్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): గెలుపు గుర్రంపైనే ప్రశాంత్ కిషోర్ పందెం కాస్తున్నారని, ఆయన మాటలు ఫలించవని ఎండీఎంకే ప్రధాన కార్యదర్శి దురై వైగో ఎద్దేవా చేశారు. నగరంలో ఆదివారం మీడియాతో మాట్లాడుతూ... మొక్కజొన్నపై సెస్ పన్ను తొలగించాలని ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి చేసిన విజ్ఞప్తిని కేంద్ర మంత్రి అంగీకరించినందుకు ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు. సాతూర్, కోవిల్ పట్టి సహా పలు ప్రాంతాల్లో అగ్గిపెట్టెల పరిశ్రమలపై ఆధారపడి వేలాది కుటుంబాలు జీవిస్తున్నాయని, చైనా లైటర్ ద్వారా ఆ పరిశ్రమ నష్టాలు ఎదుర్కొనే పరిస్థితి నెలకొందన్నారు. చైనా నుంచి లైటర్ల దిగుమతిపై కేంద్ర ప్రభుత్వం నిషేధం విధించాలని, అలాగే, రాష్ట్రంలో వీటి విక్రయాలు అడ్డుకొనేలా ముఖ్యమంత్రి చర్యలు చేపట్టాలని కోరారు. రాజకీయ విశ్లేషకుడు ప్రశాంత్ కిషోర్ అభిప్రాయాలు వంద శాతం నెరవేరవని, రాష్ట్రంలో గెలుపు గుర్రంపై ఆయన పందేలు కాస్తున్నారని ఎద్దేవా చేశారు. విజయ్ మంచి స్టార్ అని, అతని వెనుక పెద్దసంఖ్యలో యువత ఉందన్నారు. ఆయన చెబుతున్న సిద్ధాంతాలు, ప్రణాళికలు స్వాగతిస్తున్నామని, ఈ ప్రభుత్వానికి ప్రతిపక్ష పార్టీగా ఆయన తన అభిప్రాయాలు చెబుతున్నట్లు భావిస్తున్నామని దురై వైగో తెలిపారు.

బీచ్-తాంబరం రైళ్ల రద్దుతో ప్రయాణికులకు ఇబ్బందులు

ప్యారీస్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): చెన్నై బీచ్-ఎగ్మూర్ మార్గంలో చేపడుతున్న నాలుగో రైలు మార్గం పనుల కారణంగా ఆదివారం ఉదయం చెన్నై బీచ్-తాంబరం మధ్య సబర్బన్ రైళ్లు రద్దు చేస్తున్నట్లు దక్షిణమధ్య రైల్వే ప్రకటించిన విషయం తెలిసిందే. ఆ ప్రకారం, ఆదివారం తెల్లవారుజామున 5.10 నుంచి సాయంత్రం 4.10 వరకు చెన్నై బీచ్ నుంచి తాంబరం-కాంచీపురం-చెంగల్పట్టు వెళ్ళే రైళ్లు పూర్తిగా రద్దయ్యాయి. దీంతో చెన్నై సెంట్రల్ నుండి తాంబరం, చెంగల్పట్టు మార్గంలో వెళ్ళే చెన్నై పార్క్ స్టేషన్‌ను అధికారులు మూసివేశారు. స్టేషన్ ఎంట్రన్స్‌లో నోఎంట్రీ బోర్డులు పెట్టి, రైళ్ల రద్దు సమాచారంతో నోటీసులు పెట్టారు. దీనితో రైలులో ప్రయాణించాల్సిన ప్రజలు బస్సుల బాటపట్టాల్సివచ్చింది. నిరంతరం ప్రయాణికులతో రద్దీగా వుండే చెన్నై సెంట్రల్‌స్టేషన్ బయట రోడ్డు, పార్క్‌స్టేషన్ ప్రాంగణం జనంలేక ఖాళీగా దర్శనమిచ్చాయి. అనంతరం సాయంత్రం 4.10 గంటల ఆదివారం టైం టేబుల్ ప్రకారం రైళ్లు పునఃప్రారంభించారు.



మూసివేసిన చెన్నై పార్క్ రైల్వేస్టేషన్, ఖాళీగా వున్న చెన్నై సెంట్రల్ రోడ్డు

కనిమొళికి హిందీ బాగా తెలుసు

● కేంద్రమంత్రి ఎల్.మురుగన్



ప్యారీస్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): డీఎంకే ఎంపీ కనిమొళి హిందీ బాగా మాట్లాడతారని కేంద్రమంత్రి డాక్టర్ ఎల్.మురుగన్ పేర్కొన్నారు. నంగనల్లూర్‌లో నూతనంగా నిర్మించిన బీజేపీ కార్యాలయం ప్రారంభోత్సవం ఆదివారం జరిగింది. ఆ సందర్భంగా పార్లమెంట్ ఉభయసభల్లో పాల్గొనే తమిళ ఎంపీలు హిందీలో మాట్లాడలేరా అని విలేఖర్లు ప్రశ్నించగా, ఎంపీ కనిమొళి హిందీలో బాగా మాట్లాడుతారని తెలిపారు. బీజేపీ సిద్ధాంతపరంగా పనిచేస్తున్న పార్టీ అని, 14కోట్ల మందికి పైగా సభ్యులతో ప్రపంచంలోనే అతిపెద్ద పార్టీగా గుర్తింపు పొందిందని వివరించారు. దేశం అభివృద్ధి చెందేందుకు అవసరమైన పథకాలను ప్రధాని మోదీ నేతృత్వంలోని కేంద్రం అమలు చేస్తోందని తెలిపారు. మోదీ తమిళ భాషకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని, ఐక్యరాజ్య సమితిలో తమిళ భాష ఘనత గురించి ప్రసంగించారని, అంతేకాకుండా తిరుకురళ్‌ను 35భాషాల్లో తర్జుమా చేయించి, ప్రపంచ దేశాలకు వ్యాపింపజేశారని తెలిపారు.

పోలీసుల సామూహిక బదిలీలు

పెరంబూర్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): ముట్టం గ్రామంలో గత నెల 14వ తేది ఇద్దరు యువకులు హత్యకు గురైన వ్యవహారంలో పెరంబూర్ పోలీస్‌స్టేషన్‌లో పనిచేస్తున్న పోలీసులు అందరినీ బదిలీ చేశారు. మైలాడుదురై జిల్లా పెరంబూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ముట్టం గ్రామంలో సారా విక్రయాలపై పోలీసులకు సమాచారం అందించడం, సారా విక్రయాలు అడ్డుకోవడం వంటి ఘటనలు గత నెల తీవ్రరూపం దాల్చాయి. ఈ క్రమంలో, గత నెల 14వ తేది సారా వ్యాపారి రాజ్‌కుమార్, బంధువులు తంగదురై, మూవేందన్ పాతకక్షల కారణంగా దినేష్‌పై దాడి చేశారు. దాడిని అడ్డుకొనేందుకు యత్నించిన ముట్టం హరీష్, శ్రీనివాసపురానికి చెందిన హరిశక్తి తదితరులపై కత్తులతో దాడిచేసి హతమార్చారు. ఈ ఘటనపై పెరంబూర్ పోలీసులు కేసు నమోదుచేసి రాజ్‌కుమార్, తంగదురై, మూవేందన్, మునుస్వామి, మంజుల అనే వారిని అరెస్ట్ చేశారు. ఈ ఘటన కారణంగా పెరంబూర్ సీఐ నాగవల్లిని వీఆర్‌కు పంపారు. అనంతరం ఎస్పీ వ్యక్తిగత విభాగం పోలీసు ప్రభాకర్, ఎస్‌ఐలు మణిమారన్, శంకర్ తదితరులు ఒకరి తర్వాత మరొకరు బదిలీ అయ్యారు. ఈ నేపథ్యంలో, శనివారం రాత్రి పెరంబూర్ స్టేషన్‌లో పనిచేస్తున్న పదిమంది కానిస్టేబుళ్లను బదిలీ చేస్తూ జిల్లా ఎస్పీ స్టాలిన్ ఉత్తర్వులు జారీచేశారు. పెరంబూర్ పోలీస్ స్టేషన్ సహా జిల్లావ్యాప్తంగా నిర్వహణ వసతులతో మొత్తం 70 మంది హఠాత్తుగా బదిలీ అయ్యారు.

నాటుబాంబు పేలి ఒకరి మృతి

పెరంబూర్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): దిండుగల్ జిల్లా వత్తలగుండు సమీపం కొంబైపట్టిలో నాటుబాంబు పేలి బాలమురుగన్ మృతిచెందాడు. దుకాణం పైభాగంలో దాచిన నాటుబాంబులు వేరే ప్రాంతానికి తరలిస్తుండగా, బాంబు పేలింది. ఈ ఘటనలో గాయపడిన కన్నన్‌ను చుట్టుపక్కల వారు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

రోడ్డు ప్రమాదంలో బామ్మ, మనవడి మృతి

ప్యారీస్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): ఈరోడ్ జిల్లా పులియంపట్టిలో ఆదివారం ఉదయం ద్విచక్ర వాహనాన్ని లారీ ఢీకొన్న ఘటనలో బామ్మ, మనవడు సంఘటనా స్థలంలోనే మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. జిల్లాలోని సెంబడైపాళయంకు చెందిన ఉన్నమ్మాళ్ (60) ఆమె మనవడు రమేష్ (23) ఓ వివాహ కార్యక్రమం కోసం ఆదివారం తమ ద్విచక్రవాహనంలో బయల్దేరారు. వారు ఉదయం 9.30గంటలకు పులియంపట్టి మార్గంలో వెళ్తుండగా ఓ లారీ వారి ద్విచక్ర వాహనాన్ని ఢీకొంది. తీవ్రంగా గాయపడిన బామ్మ, మనువడు అక్కడికక్కడే మృతిచెందారు. పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

అదుపుతప్పి గుంతలో పడిన బస్సు



పెరంబూర్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): నీలగిరి జిల్లాలో టూరిస్ట్ బస్సు అదుపుతప్పి రోడ్డు పక్కనున్న గుంతలో పడిన ఘటనలో 17 మందికి గాయాలయ్యాయి. కేరళ రాష్ట్రం కన్నూర్‌కు చెందిన వారు మినీ బస్సులో నీలగిరి జిల్లా ఊటీకి విహార యాత్రకు బయల్దేరారు. ఆదివారం మధ్యాహ్నం పాడన్‌తురై ప్రాంతంలో ఆ బస్సు హఠాత్తుగా అదుపు తప్పి రోడ్డు పక్కనే ఉన్న తేయాకు తోటలోని గుంతలో పడిపోయింది. ఈ ఘటనలో 19 మందికి గాయాలయ్యాయి. చుట్టుపక్కల వారు బస్సు నుంచి క్షతగాత్రులను రక్షించి కూడలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై కూడలూరు పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

జాలర్ల విడుదల కోసం పాంబన్ జాలర్ల సమ్మె

ప్యారీస్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): శ్రీలంక జైల్లో బందీలుగా ఉన్న తమిళజాలర్లను విడుదల చేయించాలని కేంద్ర,రాష్ట్రప్రభుత్వాలను కోరుతూ, రామనాథపురం జిల్లా రామేశ్వరం సమీపంలోని పాంబన్‌కు చెందిన జాలర్లు ఆదివారం ఒకరోజు సమ్మె చేపట్టారు. ఇందువల్ల సుమారు 200లకు పైగా మరపడవలను ఫిషింగ్ హార్బర్‌లో నిలిపివేసిన 500మందికి పైగా జాలర్లు సమ్మెలో పాల్గొన్నారు. పాంబన్ ఫిషింగ్ హార్బర్ నుండి ఆరోగ్యస్వామికి సొంతమైన మరబోటులో సముద్రంలో చేపల వేటకు వెళ్ళిన 14మంది జాలర్లను గురువారం అరెస్టు చేసిన శ్రీలంక నావికాదళం వారి మరపడవలను కూడా స్వాధీనం చేసుకుంది. సముద్ర సరిహద్దులు దాటి చేపలవేటలో పాల్గొన్నారని వారికి వ్యతిరేకంగా ఛార్జ్‌షీటు కూడా దాఖలైంది. ఈ నేపథ్యంలో తమ ప్రాంతానికి చెందిన 14మంది జాలర్లు సహా ఇతర జిల్లాలకు చెందిన తమిళజాలర్లను శ్రీలంక జైలు నుండి విడిపించాలని, అలాగే మరపడవలు తిరిగి అప్పగించేలా చర్యలు తీసుకోవాలని కేంద్ర,రాష్ట్రప్రభుత్వాలను పాంబన్ జాలర్లు డిమాండ్ చేశారు.



నిలిచిపోయిన పడవలు

టీచర్ ఇంట్లో వంద సవర్ల నగల చోరీ

పెరంబూర్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి జిల్లా నల్లాంపల్లి సమీపంలో పట్టపగలు మహిళా టీచర్ ఇంటి తాళాలు బద్దలుకొట్టి, వంద సవర్ల నగలు రూ.1.5 లక్షల నగదు గుర్తుతెలియని వ్యక్తులు దోచుకెళ్ళారు. సేలం-ధర్మపురి జాతీయ రహదారి సమీపంలో ఇంట్లో నివసిస్తున్న షెర్లిన్ బెల్మా (45), నల్లాంపల్లి సమీపం కోవిలూరులో ఉన్న ఎయిడెడ్ పాఠశాలలో టీచర్‌గా పనిచేస్తున్నారు. అవివాహితురాలైన షెర్లిన్ బెల్మా, తల్లి మేరితో కలసి నివసిస్తోంది. తల్లి మేరి వైద్యం నిమిత్తం వేలూరు వెళ్లగా, షెర్లిన్‌బెల్మా యథావిధిగా శనివారం ఇంటికి తాళం వేసి పాఠశాలకు వెళ్లింది. సాయంత్రం ఇంటికి తిరిగిరాగా, తలుపుల తాళాలు బద్దలుకొట్టి ఉండడం చూసి దిగ్భ్రాంతి చెంది ఇంట్లోకి వెళ్లి చూడగా, బీరువాలో ఉంచిన వంద సవర్ల నగలు, రూ.1.50 లక్షల నగదు లేకపోవడంతో అదియమాన్‌పేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు, మూడు ప్రత్యేక బృందాలు ఏర్పాటుచేసి అగంతకుల కోసం గాలిస్తున్నారు.

శ్రీవిద్య 'ఆలోసనై నేరం' పుస్తకావిష్కరణ



అడయార్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): మహిళా సాధికారత, నెక్స్ట్ జనరేషన్ కోసం శ్రీవిద్య మురళి రచించిన 'ఆలోసనై నేరం' అనే పుస్తకావిష్కరణ కార్యక్రమం అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా నగరంలో జరిగింది. తమిళ భాషలో రచించిన ఈ పుస్తకంలో మహిళా సాధికారత, తదుపరి తరం కోసం జీవిత పాఠాలు, వ్యక్తిగత కథల సంకలనాలున్నాయి. దశాబ్దకాలానికిపైగా బోధనా అనుభవం ఉన్న శ్రీవిద్య మురళి ఒక విద్యావేత్తగా, సైన్స్ ఉపాధ్యాయురాలిగా రాణిస్తున్నారు. తన తొలి రచనను అంతర్జాతీయ మహిళా దినోత్సవం రోజున ఆవిష్కరించడం చాలా సంతోషంగాను, గర్వంగా ఉందని ఆమె ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు. 55 యేళ్ళ శ్రీవిద్య మురళి ప్రపంచ వ్యాప్తంగా ఉన్న విద్యార్థులకు ఆన్‌లైన్ ట్యూటర్‌గా వివిధ అంశాలను బోధిస్తుండటం గమనార్హం.

ఆదిద్రావిడ సంక్షేమ రాష్ట్ర కమిటీ రద్దు

పెరంబూర్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): ఆదిద్రావిడ, గిరిజన రాష్ట్ర కమిషన్ ఏర్పాటు చేసినందున, రాష్ట్ర ఆదిద్రావిడ సంక్షేమ కమిటీ పొడిగించలేదని ఆదిద్రావిడ, గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి లక్ష్మిప్రియ తెలిపారు. ఆ మేరకు ఆ శాఖ విడుదల చేసిన ప్రకటనలో... ఆదిద్రావిడ సంక్షేమం, వారికి ఇస్తున్న పథకాలు పర్యవేక్షించి, సలహాలు ఇచ్చేందుకు 1995లో రాష్ట్ర ఆదిద్రావిడ సంక్షేమ కమిటీ ఏర్పాటు చేశామన్నారు. ఈ కమిటీ మూడేళ్లకు ఒకసారి మారుతుందని, ఆ ప్రకారం, చివరగా 2017 ఏప్రిల్‌లో కమిటీ మార్చడం జరిగిందన్నారు. ఈ కమిటీ పదవీకాలం 2020లో ముగిసిందని తెలిపారు. ఈ నేపథ్యంలో, 2021లో ఆదిద్రావిడ, గిరిజనుల హక్కులు చట్టబద్ధంగా రక్షించేలా, తమిళనాడు ఆదిద్రావిడ, గిరిజన రాష్ట్ర కమిషన్ ఏర్పాటుచేశారన్నారు. ఈ కారణంగా, రాష్ట్రస్థాయి ఆదిద్రావిడుల సంక్షేమ కమిటీ పునర్నించేందుకు అవకాశం లేదని ఈ శాఖ తెలియజేసింది.

సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీతకు స్టాలిన్ అభినందనలు

అడయార్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డుకు ఎంపికైన తిరునెల్వేలి జిల్లా ప్రొఫెసర్ విమలకు ముఖ్యమంత్రి స్టాలిన్ శుభాకాంక్షలు తెలిపారు. ప్రస్తుతం ఢిల్లీలో సాహిత్య అకాడమీ వార్షిక వేడుకలు జరుగుతున్నాయి. ఈ వేడుకల్లో 2024 సంవత్సరానికిగాను ఎంపిక చేసిన వారికి సాహిత్య పురస్కారాలను ప్రదానం చేస్తున్నారు. మొత్తం 21 రచనలను అవార్డులకు ఎంపిక చేశారు. ఇందులో 'ఎనదు ఆణ్‌గల్' అనే రచనకుగాను ప్రొఫెసర్ విమలను ఈ పురస్కారానికి ఎంపిక చేశారు. కన్నియాకుమారికి చెందిన విమల ప్రస్తుతం నెల్లై జిల్లా పాలయంక్కోట్టైలోని సెయింట్ సవేరియార్ కాలేజీలో తమిళ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు. ఇప్పటివరకు నాలుగు సాహిత్య రచనలను తమిళంలోకి అనువాదం చేశారు. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి స్టాలిన్ ఆమెకు శుభాకాంక్షలు తెలుపుతూ ఒక ప్రకటన విడుదల చేశారు.

టాస్మాక్ అధికారులకు ఈడీ ఆదేశాలు

ప్యారీస్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): మద్యం కొనుగోలు నుంచి విక్రయాలు, బార్ లైసెన్స్ వివరాలను అప్పగించాల్సిందిగా టాస్మాక్ అధికారులకు ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం (ఈడీ)అధికారులు ఆదేశాలు జారీచేశారు. తాజాగా కరూర్‌లోవున్న మంత్రి సెంథిల్ బాలాజీ బంధువులు, స్నేహితుల ఇళ్ళలో ఈడీ అధికారులు తనిఖీలు నిర్వహించారు. అదేవిధంగా ఎగ్మూర్‌లోవున్న టాస్మాక్ ప్రధాన కార్యాలయంలో తనిఖీలు చేసి, పలు పత్రాలను స్వాధీనం చేసుకున్నారు. డీఎంకే ఎంపీ జగద్రక్షగన్‌కు చెందిన 20పైగా కార్యాలయాల్లో కూడా తనిఖీలు జరిగాయి. తిరువాన్మియూర్‌లో వున్న డీఎంకే నేత కాళిదాసన్ ఇంట్లో శనివారం 5గంటల పాటు నిర్వహించిన తనిఖీల్లో లభ్యమైన 4,829 టాస్మాక్ చిల్లర దుకాణాల వివరాల రికార్డులు, బార్ లైసెన్స్, మద్యం తయారీ కర్మాగారాలు తదితర వివరాలను అప్పగించాల్సిందిగా ఈడీ అధికారులు టాస్మాక్ అధికారులకు ఉత్తర్వులు జారీచేసినట్లు సమాచారం.

పారిశుధ్య కార్మికురాలి నిజాయితీ దొరికిన నగ యజమానికి అప్పగింత



పారిశుధ్య కార్మికురాలు మజ్ఞా

పెరంబూర్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): మహిళా పారిశుధ్య కార్మికురాలి నిజాయితీని అధికారులు, ప్రజలు ప్రశంసించారు. రాయపేట ప్రభుత్వాస్పత్రిలో ఇన్‌పేషంట్‌గా ఉన్న ఓ మహిళ శనివారం ఉదయం తన ఒకటిన్నర సవర నగదు పోగొట్టుకుంది. ఈ నగ కోసం వార్డు, ఆస్పత్రి ప్రాంగణాలు గాలించినా ఫలితం లేకపోయింది. నిత్యం ప్రజలు సంచరించే ప్రాంతంలో పడిపోయిన నగ తిరిగి దొరుకుతుందా? అని భావించిన ఆమె, నగ కోసం ఆశలు వదులుకుంది. ఈ క్రమంలో, అక్కడ పారిశుధ్య కార్మికురాలిగా పనిచేస్తున్న మజ్ఞాకు నగ దొరికింది. బంగారం లభించినా ఆశపడని ఆమె, ఈ నగను నిజాయితీగా ఆస్పత్రి అధికారులకు అప్పగించింది. అంతర్జాతీయ మహిళా దినోత్సవం రోజున మహిళా పారిశుధ్య కార్మికురాలి నిజాయితీని ఆసుపత్రి సిబ్బంది మాత్రమే కాకుండా అక్కడున్న వారందరూ అభినందించారు.

మందుబాబులను పట్టించే శిరస్త్రాణం

● కోవై కళాశాల విద్యార్థుల ఆవిష్కరణ



హెల్మెట్ పనితీరు వివరిస్తున్న విద్యార్థినులు

అడయార్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): మద్యం సేవించి ద్విచక్రవాహనాలను నడిపే మందు బాబులను సులభంగా పట్టించే హెల్మెట్‌ను కోయంబత్తూరుకు చెందిన ఓ కళాశాల విద్యార్థులు నూతనంగా ఆవిష్కరించారు. సెన్సార్‌తో పనిచేసే ఈ హెల్మెట్ మద్యం సేవించి వాహనం నడపాలని ప్రయత్నిస్తే అందుకు అనుమతించదని వారంటున్నారు. ప్రస్తుతం మద్యం సేవించి వాహనాలు నడిపేవారిని గుర్తించేందుకు ట్రాఫిక్ పోలీసులు డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టులు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో కోవై విద్యార్థులు సరికొత్త హెల్మెట్ తయారు చేశారు. సెన్సార్‌తో ఉన్న ఈ హెల్మెట్‌ను ద్విచక్ర వాహనంతో అనుసంధానం చేస్తారు. మద్యం సేవించిన వారు వాహనాన్ని నడపాలని ప్రయత్నిస్తే వీలుకాదు. ఇదే విషయంపై విద్యార్థులు మాట్లాడుతూ, మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల జరిగే ప్రమాదాలను నివారించేలా హెల్మెట్‌ను రూపొందించామన్నారు. ఈ ఆవిష్కరణ రోడ్డు ప్రమాదాలను తగ్గిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.



కమల్ సరసన నటించాలని ఉంది

● మృణాల్ ఠాగూర్

తనకు తమిళ చిత్రపరిశ్రమలో అగ్రనటుడు కమల్ హాసన్ సరసన నటించాలని వుందని హీరోయిన్ మృణాల్ ఠాగూర్ అంటున్నారు. 'సీతా రామం' చిత్రంతో జాతీయ స్థాయిలో గుర్తింపుతో పాటు క్రేజ్‌ను సొంతం చేసుకున్న ఈ భామ.. ఆ తర్వాత ప్రభాస్ నటించిన 'కల్కి 2898ఏడీ'లో ప్రత్యేక పాత్రలో నటించింది.. ప్రస్తుతం తెలుగు, హిందీ భాషా చిత్రాలతో బిజీగా ఉంది. తాజాగా ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో తన మనసులోని మాటను వెల్లడించింది. 'తమిళ చిత్రపరిశ్రమంలో అగ్రనటుడు కమల్ హాసన్ సరసన నటించాలని ఉంది. ఆయనతో కలిసి డ్యాన్స్ చేయాలని ఉంది. ఎందుకంటే, కేవలం నటనలోనేకాకుండా, నృత్యంలోనూ ఇతర హీరోలను అధికగమించి ఓ ట్రెండ్ సృష్టించిన హీరో అని ఆమె గుర్తుచేశారు. ఇపుడు సినిమాలకు భాషా సరిహద్దులు లేవు. కంటెంట్ ప్రేక్షకుడికి నచ్చితే అలాంటి చిత్రాలకు బ్రహ్మరథం పడుతున్నారు. నేను హీరోయిన్‌గా నటించిన 'సీతారామం' చిత్రమే ఇందులో ఓ మంచి ఉదాహరణ' అని గుర్తుచేశారు.

కుటుంబ సమేతంగా చూడాల్సిన చిత్రం 'పెరిసు'

● దర్శకుడు ఇళంగో రామ్



'పెరిసు' ఆడియో రిలీజ్‌లో చిత్ర బృందం

తమిళ చిత్రజ్యోతి

తన దర్శకత్వంలో రూపొందిన 'పెరిసు' మూవీ కుటుంబ సమేతంగా చూడదగిన సినిమా అని ఆ చిత్ర దర్శకుడు ఇళంగో రామ్ అన్నారు. దర్శకుడు కార్తీక్ సుబ్బురాజ్ సొంత నిర్మాణ సంస్థ స్టోన్ బెంచ్ పతాకంపై ఇళంగో రామ్ దర్శకత్వంలో నిర్మించిన మూవీ 'పెరిసు'. వైభవ్, సునీల్ ప్రధాన పాత్రలు పోషించారు. ఇతర పాత్రల్లో బాలశరవణన్, రెడిన్ కింగ్‌స్లీ, నిహారిక నటించారు. ఈ నెల 14న ఈ చిత్రం విడుదల కానున్న నేపథ్యంలో చిత్ర బృందం నగరంలో మీడియా సమావేశాన్ని నిర్వహించగా, చిత్ర బృందం పాల్గొంది. దర్శకుడు ఇళంగో రామ్ మాట్లాడుతూ, 'సినిమా చిత్రీకరణ సాఫీగా సాగాలంటే మంచి నిర్మాత కావాలి. ఈ విషయంలో నేను అదృష్టవంతుడుని. నాకు 80 దశంలో వచ్చిన చిత్రాలంటే ఎంతో ఇష్టం. అవి కుటుంబ సమేతంగా చూడదగిన మూవీలుగా ఉండేవి. ఈ సినిమా కూడా అలానే ఉంటుంది. వైభవ్, సునీల్ ఈ ప్రాజెక్టు పూర్తయ్యేందుకు అండగా నిలిచారు. అని పేర్కొన్నారు. హీరో వైభవ్ మాట్లాడుతూ సినిమా షూటింగ్ సాఫీగా సాగిపోయింది. మీలాగే నేను కూడా సినిమా చూడాలని ఎంతో ఆసక్తిగా ఉన్నాను. నిర్మాత కార్తీక్ సుబ్బురాజ్ మాట్లాడుతూ, 'దర్శకుడు నేను కలిసినపుడల్లా మంచి సినిమాలు తీయాలని అనుకునేవాళ్ళం. 'కూళంగల్' మూవీ మా బ్యానరులో తీయాల్సివుండగా, అనివార్య కారణాలతో అది చేజారిపోయింది. ఇపుడు 'పెరిసు' కథ చెప్పడంతో నాకు బాగా నచ్చి ఈ ప్రాజెక్టు కార్యరూపందాల్చింది. కథలో కామెడీతో పాటు ఎమోషన్ కూడా ఉంది. 18 యేళ్ళు పైబడినవారు తమ కుటుంబ సభ్యులతో కలిసి వచ్చి హాయిగా సినిమా చూడొచ్చు. ఈ సినిమాలో నటించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు' అని పేర్కొన్నారు. అలాగే, నిర్మాత కార్తికేయన్, రచయిత బాలాజీ, నటీనటులు తదితరులు మాట్లాడారు.



'రాజపుత్తిరన్'లో ఓ దృశ్యం

విడుదలకు సిద్ధమైన 'రాజపుత్తిరన్'

సీనియర్ నటుడు ప్రభు, వెట్రి ప్రధాన పాత్రల్లో నటించిన 'రాజపుత్తిరన్' చిత్రం షూటింగ్ పూర్తిచేసుకుంది. ఇందులో కన్నడ నటుడు కోమల్ కుమార్ ప్రతినాయకుడిగా చేస్తున్నారు. 1990 దశకంలో రామనాథపురం జిల్లాలో జరిగిన కొన్ని యదార్థ సంఘటనలను ఆధారంగా చేసుకుని చిత్రీకరించారు. తండ్రీ కుమారుల మధ్య సాగే భావోద్వేగ ప్రయాణం, పోరాటాన్ని వాస్తవికత దెబ్బతీయకుండా హృదయానికి హత్తుకునేలా అందమైన ప్రేమ కథా చిత్రంగా దర్శకుడు మహాకాంతన్ రూపొందించారు. ఈ సినిమాకు పాటలు వైరముత్తు,కెమెరా ఆలివర్ డెన్నీ, సంగీతం ఏఐఎస్ నౌఫల్ రాజా. సీనియర్ దర్శక నటుడు టి.రాజేందర్, సంగీత దర్శకుడు జీవీ ప్రకాష్ కుమార్ మరో పాట నేపథ్యగానం చేశారు. ఆర్వీ ఉదయకుమార్, మన్సూర్ అలీఖాన్, లివింగ్‌స్టన్, తంగదురై తదితరులు ఇతర పాత్రలు పోషించారు.ఈ సినిమా గురించి దర్శకుడు మహాకాంతన్ మాట్లాడుతూ,'రామనాథపురం పరిసర ప్రాంతాల్లో షూటింగ్ పూర్తి చేశాం. అందరికీ నచ్చే వినోదాత్మక అంశాలతో ఈ మూవీ ఉంటుంది. ఏప్రిల్ నెలలో విడుదల చేస్తాం. రిలీజ్ తేదీని త్వరలోనే వెల్లడిస్తాం' అని పేర్కొన్నారు.



'అక్యూస్డ్' చిత్ర బృందం

'అక్యూస్డ్' షూటింగ్ పూర్తి

ఉదయ, అజ్మల్, యోగిబాబు ప్రధాన పాత్రలు పోషిస్తూ నటించిన చిత్రం 'అక్యూస్డ్' షూటింగ్ పూర్తి చేసుకుంది. సచిన్ సినిమాస్, జేషన్ స్టూడియోస్ సహకారంతో దయాకరన్ సినీ ప్రొడక్షన్, ఎంఐవై స్టూడియోస్ బ్యానర్లపై ఏఎల్ ఉదయ, దయ ఎన్ పన్నీర్‌సెల్వ, ఎం.తంగవేల్ కలిసి భారీ బడ్జెట్‌తో నిర్మించారు. నటుడు ఉదయ సిల్వర్ జూబ్లీ సినీ ప్రయాణాన్ని తెలిపేలా ఈ సినిమా రూపొందించారు. కన్నడంలో పలు విజయవంతమైన చిత్రాలను రూపొందించిన ప్రభు శ్రీనివాస్ దర్శకత్వం వహించారు. కన్నడ నటి జాన్వికా హీరోయిన్‌గా నటించారు.భారీ బడ్జెట్‌తో నిర్మించిన ఈ చిత్రం షూటింగ్ సింగిల్ షెడ్యూల్‌లో 54 రోజుల్లో పూర్తి చేశారు. ఈ విషయాన్ని మహిళా దినోత్సవం సందర్భంగా వెల్లడించారు. సేలం బ్యాక్‌డ్రాప్‌లో రూపొందిన సినిమా కావడంతో సేలం మోడరన్ థియేటర్ ప్రవేశ ద్వారం వద్ద షూటింగ్ ముగించారు. ఇందులో ప్రముఖ దర్శకుడు ప్రభు సాల్మన్ ఓ ముఖ్య పాత్ర పోషిస్తున్నారు. మరో డైరెక్టర్ దర్శకత్వంలో ప్రభు సాల్మన్ నటించడం ఇదే తొలిసారి కావడం గమనార్హం. పోస్ట్ ప్రొడక్షన్ నిర్మాణ పనులు శరవేగంగా పూర్తి చేసి వేసవికి విడుదల చేయాలని మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు.

● తిరుచెందూరులో మాసి ఉత్సవాలు

వట్టివేర్ల సప్పరంలో ఊరేగిన షణ్ముఖనాథుడు





సప్పరంలో ఊరేగుతున్న స్వామివారు - ప్రత్యేక అలంకరణలో షణ్ముఖనాథుడు

చెన్నై, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): తిరుచెందూరు సెందిల్ ఆండవర్ ఆలయంలో వార్షిక మాసి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం ఉదయం సర్వాలంకరణ శోభితులై షణ్ముఖనాథస్వామి వట్టి వేర్ల సప్పరంలో ఊరేగారు. ఈ ఆలయంలో మాసి ఉత్సవాలు ఈ నెల మూడున ధ్వజారోహణంతో ప్రారంభమైన విషయం విదితమే. ఈ వేడుకల్లో శనివారం అర్ధరాత్రి దాటిన తరువాత ఒంటి గంటకు ఆలయాన్ని తెరిచి 1.30 గంటలకు విశ్వరూప దర్శనం, 2 గంటలకు ఉదయమార్తాండ అభిషేకం, వేకువజాము 5 గంటలకు 'ఉరుకు సట్ట సేవ' (కాంస్య కవచధారణ సేవ) చేశారు. ఉదయం 9 గంటలకు షణ్ముగనాథుడు సర్వాభరణాలు, పుష్పాలంకరణలతో వట్టివేర్ల సప్పరంలో ఆశీనులయ్యారు. ఆలయం నుండి దారిపొడవునా భక్తజనం నడుమ ఊరేగింపుగా బయలుదేరి 'పిళ్ళయాన్ కట్టలై మండపానికి చేరారు. అక్కడ అభిషేకం, దీపారాధన తర్వాత సాయంత్రం 4.20 గంటలకు షణ్ముఖనాథుడు శివాంశాన్ని తలపించేలా అరుణ ముఖారవిందంతో ఆలయం చుట్టూ ఎనిమిది ప్రధాన వీధుల్లో ఊరేగి ప్రధాన ఆలయానికి చేరుకున్నారు.సోమవారం మధ్యాహ్నం 12గంటలకు షణ్ముఖనాథస్వామి విష్ణు అంశాన్ని తలపించేలా పచ్చటి రత్నాలు, ముత్యాల సప్పంలో హరితవర్ణధారుడై ఎనిమిది వీధులలో ఊరేగి ఆలయాన్ని చేరుకుంటారు. ఈ వేడుకల ప్రధానఘట్టమైన రథోత్సవం ఈ నెల 12న జరుగనుంది.భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలుగకుండా ఆలయ తక్కార్ అరుళ్‌మురుగన్, డిప్యూటీ కమిషనర్ జ్ఞానశేఖరన్, ఆలయ అధికారులు, పోలీసులు తగు వసతులు కల్పించి పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు కూడా చేపడుతున్నారు.

కీళడి మ్యూజియం నిర్మాణ ప్రాంతంలో

సందర్శకుల ప్రవేశం రద్దు



కీలడి ఓపెన్ ఎయిర్ మ్యూజియం ప్రాంతం

టి.నగర్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): కీళడి ఓపెన్ ఎయిర్ మ్యూజియం నిర్మాణ ప్రాంతంలో ఆదివారం నుంచి సందర్శకుల ప్రవేశంపై నిషేధం ప్రకటించారు. మదురై సమీపం కీళడి ప్రాంతంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తరపున ఇప్పటివరకు తొమ్మిది విడతలుగా పురావస్తు తవ్వకాలు జరిపారు. ఈ ప్రాంతంలో బయల్పడిన తమిళ ప్రాచీన నాగరికతకు సంబంధించిన ప్రాచీన వస్తువులన్నింటిని ఈ మ్యూజియం ప్రాంతంలో భద్రపరిచారు. వీటిని పర్యాటకులు, స్థానిక ప్రజలు రోజూ సందర్శిస్తున్నారు. ఏడో విడత పురావస్తు తవ్వకాలు జరిగిన ప్రాంతం వద్ద కూడా ప్రాచీన వస్తువులను సందర్శనకు ఉంచారు. ఈ నేపథ్యంలో గత జనవరిలో కీళడి పురావస్తు తవ్వకాలు జరిగిన ప్రాంతం వద్ద రూ.17.80 కోట్లతో ఓపెన్ ఎయిర్ మ్యూజియం నిర్మాణానికి సీఎం శంకుస్థాపన చేశారు. ఆ మేరకు ఫిబవరి 16న మంత్రులు తంగం తెన్నరసు, పెరియకర్పున్ తదితరులు మ్యూజియం నిర్మాణ పనులను ప్రారంభించారు. అప్పటి నుండి ఇక్కడ నిర్మాణ పనులు చురుకుగా సాగుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం పురావస్తు తవ్వకాలు జరిపిన ప్రాంతాలను కలిపి తొలుత ఓపెన్ ఎయిర్ మ్యూజియంగా మార్చాలని నిర్ణయించారు. ఆ మేరకు కీళడి పురావస్తు పరిశోధనల విభాగం సంచాలకులు రమేష్, ఉప సంచాలకులు అజయ్ నాయకత్వంలో ఆ విభాగానికి చెందిన విద్యార్థులు సుమారు 40 మంది ఓపెన్ ఎయిర్ మ్యూజియం మొదటి దశ నిర్మాణ పనుల్లో నిమగ్నమయ్యారు. ఈ నేపథ్యంలో ఆదివారం నుండి తాజా తవ్వకాలలో లభించిన ప్రాచీన వస్తువులు భద్రపరచిన ఓపెన్ ఎయిర్ మ్యూజియం నిర్మాణ స్థలం వద్ద సందర్శకులను అనుమతించకుండా అధికారులు కట్టుదిట్టం చేశారు. తదుపరి ఉత్తర్వులు వచ్చేంత వరకూ ఈ ప్రాంతంలో సందర్శకులను అనుమతించబోమని అధికారులు ప్రకటించారు.

వ్యాయామంతో సంపూర్ణ ఆరోగ్యం

● బీజేపీ సీనియర్ నేత తమిళిసై



ధ్యానం కార్యక్రమంలో తమిళిసై సౌందరరాజన్, డాక్టర్ శ్రీవర్మ తదితరులు

ప్యారీస్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): వ్యాయామంతోనే సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని బీజేపీ సీనియర్ నేత డాక్టర్ తమిళిసై సౌందరరాజన్ పేర్కొన్నారు. మనపాక్కంలోని శ్రీరామచంద్ర మిషన్ సెంటర్‌లో ఆదివారం ఉదయం కేంద్ర యువజన సంక్షేమం, క్రీడాభివృద్ధి మంత్రిత్వ శాఖ, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా, శ్రీరామచంద్ర మిషన్ సంయుక్త ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో భాగంగా మహిళల ఆరోగ్యం అనే అంశంపై ఒకరోజు సదస్సు జరిగింది. పలువురు మహిళా డాక్టర్లతో కలిసి డాక్టర్ తమిళిసై కూడా మహిళలకు వైద్యపరీక్షలు నిర్వహించి ఆరోగ్య సూత్రాలను వివరించారు. ఇందులో భాగంగా నిర్వహించిన యోగా, వ్యాయామం, వాకింగ్, ధ్యానంలో సుమారు 2వేల మందికి పైగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ శ్రీవర్మ ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్న మహిళలు వాటినుండి బయటపడేందుకు చేయించుకోవాల్సి చికిత్సలు, ఆరోగ్యంగా వుండేందుకు ప్రతిరోజు క్రమం తప్పకుండా వ్యాయామం, ధ్యానంలో కొంత సమయం వెచ్చించాలని సూచనలిచ్చారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న తమిళిసై మాట్లాడుతూ, సమాజంలో సాంకేతిక పరిజ్ఞానం వేగంగా అభివృద్ధి చెందుతున్న ఈ రోజుల్లో మానసిక రుగ్మతల నుండి మనల్ని మనం కాపాడుకోవాలంటే డాక్టర్ల సూచనలతో పాటు కొందమేరకు వ్యాయామాలు కూడా చేయాలని తెలిపారు.

మురుగన్ సేవలో దర్శకుడు సుందర్

● తల నీలాల సమర్పణ



కుటుంబ సభ్యులతో సుందర్ సి సెల్ఫీ

అడయార్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ సినీ దర్శకుడు సుందర్ సి, సినీ నటి, బీజేపీ మహిళా నేత ఖుష్బూ దంపతులు వైవాహిక బంధంలోకి అడుగుపెట్టి 25 యేళ్ళు పూర్తయ్యాయి. దీనిని పురస్కరించుకుని, సుందర్ కుటుంబ సభ్యులతో కలిసి ఆదివారం పళని మురుగన్ సేవలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా దర్శకుడు సుందర్ స్వామివారికి తలనీలాలు సమర్పించి మొక్కు తీర్చుకున్నారు. ఆ తర్వాత స్వామివారికి ప్రత్యేక పూజలు చేసి, దర్శనం చేసుకున్నారు. తమ 25వ పెళ్ళి రోజును పురస్కరించుకుని అన్నదాన పథకానికి రూ.లక్ష విరాళం అందజేశారు. అలాగే, కైలాస నాథన్, ఆనంద్ వినాయగర్ సన్నిధి, భోగర్ జీవ సమాధి తదితర ప్రాంతాలకు వెళ్ళి పూజలు చేశారు. కాగా, పళని ఆలయానికి వచ్చిన సుందర్ దంపతులతో అనేక మంది భక్తులు సెల్ఫీలు, ఫొటోలు తీసుకునేందుకు పోటీపడ్డారు.

కుమరికి పోటెత్తిన పర్యాటకులు



తిరువళ్ళువర్ విగ్రహ ప్రాంతం వద్ద పర్యాటకులు

చెన్నై, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ పర్యాటక ప్రాంతం కన్నియాకుమారికి ఆదివారం ఉదయం రాష్ట్రం నలుమూలల నుంచే కాకుండా దేశవిదేశాల నుండి పర్యాటకులు వేలసంఖ్యలో తరలివచ్చారు. దీంతో ఆ ప్రాంతంలో సూర్యోదయం తిలకించే ప్రాంతం, వివేకానందర స్మారక మండపం, తిరువళ్ళువర్ విగ్రహం, ఈ రెండింటిని కలిపే అద్దాల వంతెన ప్రాంతం వద్ద పర్యాటకులు సందడి చేశారు. మూడు రోజుల క్రితం పర్యాటకులు లేక వెలవెలబోయిన కన్నియాకుమారి ప్రాంతం శనివారం మధ్యాహ్నం నుండే పర్యాటకులతో కళకళలాడింది. కన్నియాకుమారి సముద్రతీరానికి చేరువగా ఉన్న టీటీడీ శ్రీవారి ఆలయంలో స్వామివారి దర్శనానికి కూడా భక్తులు బారులు తీరారు. ఇదే విధంగా కామరాజర్ స్మారకమండపం, సునామీ స్మారక ఉద్యానవనం, మునిసిపాలిటీ పార్కుల, సన్‌సెట్ పాయింట్, మ్యూజియం, అక్వేరియం, లైట్‌హౌస్, భారతమాత ఆలయం, రామాలయం,తానుమాలయస్వామి ఆలయం తదితర ప్రాంతాల వద్ద కూడా పర్యాటకులు, భక్తుల రద్దీ అధికంగా కనిపించింది.



త్రివేణి సంగమం వద్ద రద్దీ

రూ.2.25 కోట్లతో తిరువళ్లీశ్వరాలయ జీర్ణోద్ధరణ

● పనులు ప్రారంభించిన మంత్రి శేఖర్‌బాబు



కొత్త రథం పనులను ప్రారంభిస్తున్న మంత్రి పీకే శేఖర్‌బాబు

చెన్నై, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): అంబత్తూరు సమీపం పాడి వద్దనున్న సుప్రసిద్ధ అరుళ్‌మిగు తిరువళ్ళీశ్వరాలయంలో రూ.2.25 కోట్లతో చేపట్టనున్న జీర్ణోద్ధరణ పనులకు హిందూ దేవాదాయ శాఖ మంత్రి పీకే శేఖర్‌బాబు ఆదివారం ఉదయం శ్రీకారం చుట్టారు. రూ.85 లక్షలతో కొత్త రథం తయారీ పనులను ప్రారంభించారు. ఆ తర్వాత అరుళ్‌మిగు కైలాసనాథస్వామి ఆలయం రహదారికి నాలుగడుగుల లోతున గర్భాలయంలో మూలవిరాట్టు ఉండటం వల్ల ఆ ఆలయాన్ని రహదారికి సమానంగా ఎత్తు పెంచేలా రూ.3.50 కోట్లతో చేపట్టనున్న పునర్నిర్మాణ పనులను కూడా ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ డీఎంకే ప్రభుత్వం అధికారంలోకి వచ్చాకే వేల సంఖ్యలో ఆలయాలకు మహాకుంభాభిషేకాలు జరుగుతున్నాయని, ఈ ఆదివారం రాష్ట్రం నలుమూలల 25 ఆలయాలకు కుంభాభిషేకాలు జరిగాయని తెలిపారు. ఇప్పటివరకు 2664 ఆలయాకు కుంభాభిషేకాలు ఘనంగా నిర్వహించామని, ఈ సంఖ్య త్వరలో 3 వేలకు చేరనుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో అంబత్తూరు శాసనసభ్యుడు జోసెఫ్ సామువేల్, హిందూ దేవాదాయ శాఖ కమిషనర్ బీఎస్ శ్రీధర్, డిప్యూటీ కమిషనర్ ఐ.ముల్లై, సహాక కమిషనర్ శివకుమార్, జోనల్ కమిటీ అధ్యక్షులు వీకే మూర్తి, అరుళ్‌మిగు తిరువళ్ళీశ్వర ఆలయ ట్రస్టుబోర్డు అధ్యక్షుడు వానవిల్ విజయ్, ఆలయ ఉభయదారు జగన్నాథన్, కౌన్సిలర్లు టీఎపీ రాజగోపాల్, డాక్టర్ పూర్ణిమ, నాగవల్లీ ప్రభాకరన్, ఉమా సంతానం తదితరులు పాల్గొన్నారు.

కంచి అగస్తీశ్వరాలయ రుద్రయాగం

● హాజరైన జపాన్ భక్తులు



రుద్రయాగంలో పాల్గొన్న జపాన్ భక్తులు

టి.నగర్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): ఆలయాల నగరం కాంచీపురం సమీపం కిళార్ అగస్తీశ్వరాలయంలో తమిళభాషా, సంస్కృతీ సంప్రదాయాలు, ఆధ్యాత్మిక భావాలపై ఆసక్తి కలిగి దక్షిణ భారతదేశంలోని సిద్ధపురుషుల చరిత్రపై అధ్యయనం చేస్తున్న జపాన్‌కు చెందిన 40 మంది భక్తులు రుద్రయాగం నిర్వహించారు. ప్రపంచ శాంతిని ఆశిస్తూ ఈ రుద్రయాగం నిర్వహించినట్టు వారు తెలిపారు. గత 15 సంవత్సరాలుగా తాము భారతదేశంలో పర్యటిస్తూ సుప్రసిద్ధ ఆలయాలను సందర్శిస్తున్నామని చెప్పారు. ఈ యేడాది సిద్ధపురుషులు దర్శించిన, సమాధి నొందిన దివ్య క్షేత్రాలను సందర్శించడానికి జపాన్‌లోని తమిళ పారిశ్రామిక వేత్త గోపాల్ పిళ్లై సుబ్రమణి నాయకత్వంలో తామంతా తమిళనాట ఆధ్యాత్మిక పర్యటన చేస్తున్నామని చెప్పారు. ఈ జపాన్ భక్తుల్లో 25 మంది మహిళలు ఉండటం విశేషం. వీరంతా పులిపాణి సిద్ధుడి నివాస ప్రాంతాన్ని దర్శించి అక్కడి నుండి కాంచీపురంలోని అగస్తీశ్వరాలయానికి వచ్చారు. ఆలయంలో శాస్త్రోక్తంగా, భక్తిశ్రద్ధలతో నిర్వహించిన రుద్రయాగంలో జపాన్ భక్తులంతా సుగంధ ద్రవ్యాలను, పట్టు వస్త్రాలను యాగం గుండంలో వేసి పరివార దేవతలను మొక్కారు.

గ్లోబల్ స్కూల్స్ ఆధ్వర్యంలో తమిళ పాట ఆవిష్కరణ



శేఖర్ రవ్‌జియానీ, గాయని ఆరాధనా సెంథిల్‌రాజాతో గ్లోబల్ స్కూల్స్ గ్రూపు నిర్వాహకులు, విద్యార్థులు

చెన్నై, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): నగరంలోని గ్లోబల్ స్కూల్స్ గ్రూపు ఆధ్వర్యంలో ప్రముఖ సంగీత దర్శకుడు, గాయకుడు శేఖర్ రవ్‌జియానీ పర్యవేక్షణలో 'పయ్యా పయ్యా' పేరుతో తమిళ పాట రూపొందించారు. ఆ పాట ఆవిష్కరణ కార్యక్రమంలో శేఖర్ రవ్‌జియానీ మాట్లాడుతూ ఈ పాటను ఆరాధనా సెంథిల్‌రాజా అనే 17 యేళ్ల బాలిక యువతను ఉత్తేజపరిచేలా గానం చేసినట్లు తెలిపారు. ఈ సమావేశంలో నిర్వాహకులు అవినీష్ సింగ్, తమిళ సినీ నిర్మాత హేమా రుక్మిని తదితరులు పాల్గొన్నారు.

యూనియన్ బ్యాంకు ఆధ్వర్యంలో రుణాలు



అడయార్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా చెన్నై నార్త్ రీజియన్ ఆధ్వర్యంలో ఎంఎస్ఎంఈ మెగా ఔట్‌రీచ్ కార్యక్రమం తాజాగా జరిగింది. అంబత్తూరు పారిశ్రామికవాడలోని హెచ్‌పీఎం కల్యాణ మహల్‌లో దీన్ని ఏర్పాటు చేయగా, బ్యాంకు చీఫ్ జనరల్ మేనేజర్ (సెంట్రల్ ఆఫీస్ - ముంబై) అరుణ్ కుమార్, చెన్నై జోన్ జనరల్ మేనేజర్ సత్యబన్ బెహరా ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో చెన్నై నార్త్ రీజియన్ రీజినల్ హెడ్ ముత్తు రత్నం, డిప్యూటీ రీజినల్ హెడ్ ఎం.జయకుమార్ తదితరులు పాల్గొన్నారు. నేషనల్ స్మాల్ ఇండస్ట్రీస్ కార్పొరేషన్ చీఫ్ జనరల్ మేనేజర్ శ్రీవాత్సన్ ఎంఎస్ఎంఈల వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. ఇందులో 450కి పైగా ఖాతాదారులు పాల్గొన్నారు. వివిధ లబ్ధిదారులకు రూ.160.59 కోట్ల మేరకు రుణాలను పంపిణీ చేశారు.

ఎక్స్‌ప్రెస్ అవెన్యూలో నైకా లూక్స్ స్టోర్



నైకా లూక్స్ స్టోర్ ప్రారంభోత్సవం

అడయార్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): దేశంలో అత్యంత విశ్వసనీయమైన బ్యూటీ, లైఫ్ స్టైల్ రిటైలర్ నైకా.. చెన్నై మహానగరంలో తొలిసారి లగ్జరీ బ్యూటీ షోరూమ్ 'నైకా లుక్స్' ప్రారంభించింది. రాయపేటలోని ఎక్స్‌ప్రెస్ అవెన్యూ మాల్‌లో ఈ లగ్జరీ బ్యూటీ వరల్డ్‌ను నైకా అందుబాటులోకి తీసుకొచ్చింది. ఇందులో ఐకానిక్ మేకప్ ఎసెన్షియల్ నుంచి అధునాతన చర్మ సంరక్షణ, సువాసన, జుట్టు సంరక్షణ వరకు అత్యుత్తమ అందాన్ని కోరుకునే మహిళలు ప్రపంచస్థాయి షాపింగ్ అనుభవాన్ని పొందవచ్చు. ఇందులో ఇంటర్నేషనల్ బ్రాండ్ బ్యూటీ ఉత్పత్తులతో విలాసవంతమైన మేకప్ ఫేవరేట్స్ లభ్యమవుతాయి.అలాగే, స్కిన్ కేర్ ప్రియులు అమితంగా ఇష్టపడే లాంకోమ్, మురాద్, ఒబాగి కౌడలీ వంటి అగ్రశ్రేణి బ్యాండ్‌లు కూడా అందుబాటులో ఉన్నాయి.